***

ఓ వర్ధమాన రచయిత్రిని అడిగారు ఎడిటర్ పురాణంగారు.

"ఈ మధ్య మీరు బొత్తిగా కథలు రాయడం మానేసారే?"

"ఇదివరకు మా ఆయన ఇంటికి ఆలస్యంగా వచ్చి ఏదో ఓ కొత్త కథ చెప్తూండేవారు. నేను అవి రాసేదాన్ని. ఆయన రెండేళ్ళ క్రితం పోయారు. ఇంకేం రాయను?"

***

మిల్టన్ తన భార్య బ్రతికుండగా 'పేరడైజ్ లాస్ట్' ఆవిడ మరణించాక 'పేరడైజ్ రీగైన్డ్' రాసారు. ఇది మిల్టన్ మీద జోకా? లేక అతని భార్య మీదా?

(ఉదయం వీక్లీ నుంచి)

# కావలెను

ఆ మధ్య ఓ ప్రఖ్యాత ఫిలిం కంపెనీకి మాటలు రాశాను. ప్రేమకథే అయినా, అది సరికొత్తతరహా ప్రేమకథ. స్క్రిప్ట్ పూర్తికాక మునుపు ఫలానా నటీనటులనుకున్నా, మొత్తం స్క్రిప్ట్ పూర్తయ్యాక అంతా చదువుకుంటే, ప్రేక్షకులకి ఎలాంటి అభిప్రాయంలేని కొత్త నటీనటులవుతేనే బావుంటుందన్నారు దర్శకులు. తెలుగులోని ప్రతి నటీనటులకి ప్రేక్షకులతో ఓ ముద్ర వుండటంతో కొత్త నటీనటులయితే బావుంటుందనే నిర్ణయం తీసుకున్నారు. నిర్మాత అంగీకరించడంతో ఓ తెలుగు, ఓ ఇంగ్లీషు దినపత్రికలలో కొత్త నటీనటులు కావాలని ప్రకటన ఇచ్చారు.

దాదాపు పాతికేళ్ళ అనేక మంచి తెలుగుచిత్రాలు అందించిన సంస్థ అవడంవల్ల, పేరున్న మంచి దర్శకుడు ఆ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తూండటంవల్ల, ముఖ్యంగా కేవలం ఫొటోలు, చిరునామా తప్ప

'ఎం టీఫిస్' పెట్టకపోవటంవల్ల దేశం నలుమూలలనించి కొన్నివేల అప్లికేషన్స్ ఔత్సాహిక నటీనటుల నుంచి వచ్చాయి.

ఓరోజు సరదాగా ఆ అప్లికేషన్స్‌ని పరిశీలిస్తుంటే చాలా విచిత్రాలు బయటపడ్డాయి. సినిమాల్లో నటీనటులయిపోవాలన్న కోరిక మాత్రమే కాక, ఆ అప్లికేషన్లు రకరకాల మనస్తత్వాలని, అమాయకత్వాన్ని, గుడుసుతనాన్ని.... ఇలా అనేకమయిన వాటిని బహిర్గతం చేసాయి.

ఒకాయన తన కూతురు అల్లుడు ఫొటోలని జతపరుస్తూ ఆ నిర్మాతకి రాసిన వుత్తరంలో "మా అల్లుడికి హీరోఛాన్స్ ఇచ్చి హీరోయిన్‌గా యింకెవర్నయినా పెట్టుకున్నా, లేదా కూతురికి హీరోయిన్‌ఛాన్స్ యిచ్చి హీరోగా మరొకర్ని కుదుర్చుకున్నా వప్పుకోం. వాళ్ళిద్దర్నీ హీరో, హీరోయిన్లుగా బుక్ చేసే పక్షంలోనే మమ్మల్ని పిలిపించండి" అంటూ రాసాడు.

వైన్‌షాప్ నడిపే ఓ పెద్దమనిషి తన బంధువు గురించి రాస్తూ "మా అమ్మాయికి డాన్స్ నేర్పించాను. మీరు అన్నివిధాలా ఆమెని వుపయోగించుకోవచ్చు." అని రాసిన ఉత్తరానికి ఆ అమ్మాయి ఫొటో జతచేసాడు.

ఓ పదహారేళ్ళ కుర్రాడు "మీకు ఫొటోలు కూడా పంపించలేనంత దీనస్థితిలో వున్నాను. మీరు సరేనని జవాబు రాస్తే టిక్కెట్ లేకుండా రైలెక్కి వచ్చేస్తాను." అని పోస్ట్‌కార్డ్‌మీద రాసాడు.

ఓ ఔత్సాహికుడు పంపిన ఫొటో పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటో. గమ్మత్తేమిటంటే, మొహం కనపడకుండా వెనకనుంచి తీయించుకున్న ఫొటో పంపాడాయన ఎందుకోమరి.

మరో నటుడు ఫొటోతోబాటు తన బి.ఏ. డిగ్రీ, గేమ్స్ స్పోర్ట్స్ సర్టిఫికేట్ల ఫొటోస్టాట్ కాపీలు కూడా పంపాడు, వాటి ప్రస్తావన ప్రకటనలో లేకపోయినా. "నాకు నటన తెలీదు కానీ మీదగ్గర నటించగలనన్న నమ్మకం నాకుంది" అని కూడా రాసాడు.

మరో ఉత్సాహవంతుడు "మీరు నన్ను తప్పకుండా సెలెక్టు చేసుకుంటారన్న హామీ ఇస్తే నా పేరుమీద వున్న స్థలం అమ్మేసి డబ్బు

తీసుకువస్తాను. నన్ను మీలాంటి పెద్దలే ఎంకరేజ్ చేయాలి" అని రాశాడు. అది కవరులో 'పర్సనల్' అని మార్క్ చేయబడ్డ మరొక కవరులో వుంది.

ఓ అమ్మాయి పంపిన ఫొటోతో బాటు వచ్చిన ఉత్తరంలో ఇలా ఉంది.

"దైవసమానులైన కళామతల్లి కన్నబిడ్డలైన గౌరవ, పూజ్యులైన దర్శక, నిర్మాతలకు జూనియర్ జయప్రద మీ పాదపద్మములకు నమస్కరించి భక్తితో వ్రాయునది.

మా కాలేజీలో నన్నంతా జూనియర్ జయప్రద అంటారు. ఫొటో చూస్తే మీకే అర్థమవుతుంది. జయప్రదగారికి ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా నేను నటించగలనని హామీ ఇచ్చుచున్నాను. అధికంగా వ్రాసినందుకు మన్నించండి.

—మీ జూనియర్ జయప్రద"

ఆయన వయసు దాదాపు ఏభై వుండవచ్చనిపించింది. చక్కటి ఇంగ్లీషులో టైప్ చేయబడి వుందా ఉత్తరం. ఆ ఉత్తరంతో పాటు పద్దెనిమిది ఏళ్ళ తన కూతురి ఫోటో పంపుతూ ఇలా రాశాడాయన.

మా అమ్మాయి పేరు జన్మనక్షత్రాన్ని బట్టి పెట్టాను. ఆమె ఆరవ ఏట జాతకం రాయిస్తే 64 కళలలోని ముఖ్యకళ అయిన నటనలో ఆమె తన 18 వ ఏటనుంచి రాణిస్తుందని జ్యోతిష్యుడు రాశాడు. మొదటి చిత్రంలో బాగా లాభాలు, అమ్మాయికి పేరు కూడా తెచ్చిపెడు తుందని రాసాడు. మీరు కోరితే అమ్మాయితోబాటు ఆ జాతకాన్ని కూడా తీసుకువస్తాను."

ఓ జిల్లా హెడ్‌క్వార్టర్స్ నుంచి వచ్చిన కవరులో బుర్రకథ చెప్పేవారి గ్రూప్ ఫోటో ఆ వేషాల్లో వుంది.

"మీ చిత్రంలో బుర్రకథ సీన్ లేకపోయినా ఇప్పుడు పెడితే మేం వచ్చి ఫ్రీగా ఏక్ట్ చేస్తాం" అని రాసి ఆ ఫోటోలోని వారంతా సంతకాలు చేసారు.

ఉత్సాహవంతులు కొందరు అప్పటికప్పుడు ఫోటో తీయించుకొని

స్టూడియోలోనే తీసుకొన్న కవర్లో పెట్టి పంపారు. ఫోటోలు ఆరకుండా తడిగా వుండగానే కవర్లో పెట్టడంవల్ల కవరు చింపితే వుత్తరానికి అవి అతుక్కు పోయి మొహాలు కనబడకుండా పోయాయి.

నేను మీ చిత్రంలో ఉచితంగా నటించదలచుకున్నానంటూ ఓ నటుడు వుత్తరం రాసి తన ఫోటోని జత పరిచాడు. ప్రకటించింది సాంఘికం అని అతను గమనించాడో లేదో మరి గదతో వున్న ఫోటోని పంపించాడు మహానుభావుడు.

ఓ అమ్మాయి భయం భయంగా నటించడానికి అప్లికేషన్ ఫోటోలు పంపుతూ కేరాఫ్ ఓ టైప్ రైటింగు కంపెనీ చిరునామా ఇచ్చింది.

"మా ఇంటికి రాయకండి. నేను టైపు నేర్చుకునే పై చిరునామాకు రాయండి. సినిమాల్లో నటిస్తానని తెలిస్తే మా వాళ్ళు వీపు చీరేస్తారు. నన్ను ఎన్నుకుంటే ఏదోవిధంగా వచ్చేస్తాను" అటూ రాసింది ఆ అమ్మాయి.

"అందరూ కొత్త వాళ్ళతో చిత్రాన్ని నిర్మిస్తున్న మీ ప్రయత్నాన్ని అభినందిస్తున్నా. నా వయసు 50. నేను 8 ఏళ్ళనించి 50 ఏళ్ళ వయసు దాకా గల ఏ పాత్రలోనైనా నటిస్తా. జవాబు కోసం ఎదురుచూస్తా." అంటూ ఓ నటుడు రాసాడు. ఆయన ఫోటో వయసు ఇంకా ఎక్కువ ఉందనే అనుమానం కలిగించేలా ఉంది.

ఓ నటి తన ఫోటోని పంపింది అందరిలానే. కాని అందరూ పంపిన పద్ధతిలో కాదు. ఎకా ఎకి ఫ్రేమ్ చేయబడ్డ ఫోటోనే పంపింది. ఫ్రేమ్ కున్న అద్దం అదృష్టవశాత్తు రవాణాలో విరగలేదు.

ఓ నటుడు ఫోటోతోబాటు పంపిన ఉత్తరం 14 అరఠావులుంది. అతి తక్కువ రాసిన కార్డు ఫోటోలకి స్టేపిల్ చేసిన స్లిప్ మీద "చిరంజీవిని కొట్టేది నేనే" అని!

మరో సినిమా కంపెనీ నుంచి వచ్చిన ఉత్తరాన్ని, ఫోటోని పంపుతూ ఓ నటుడు ఇలా రాశాడు. "ఈ మరో కంపెనీ నన్ను ఇంటర్వ్యూకి పిలుస్తోందంటే నాలో ఖచ్చితంగా ప్రతిభ ఉన్నట్లే. నన్ను

చూసికాని ఇంకొకర్ని సెలెక్ట్ చేసుకోవద్దని కోరుతున్నాను."

ఆ మరో సినిమా కంపెనీ నుంచి వచ్చిన ఉత్తరంలో "వచ్చేప్పుడు మీతో బాటు అడ్మిషన్ ఫీజుగా వందరూపాయలు తీసుకురావలెను" అని ఉంది.

"నేను రాజకీయాలలో తిరుగుతూంటాను కాబట్టి చిన్న చిన్న పన్లు కూడా చేసి పెట్టగలను" అని రాసాడో నటుడు. అప్పట్లో ఓ ఆడ మంత్రితో తీయించుకున్న ఫోటోని సాక్ష్యంగా జత చేసాడా రాజకీయ నటుడు.

ఓ మెడికో స్టెతస్కోప్‌తో తీయించుకున్న ఫోటో పంపాడు.

చాలా మంది తమ వివరాలతో పాటు, తాము నటించిన నాటకాల తాలూకు పాంప్లెట్స్, స్టేజీమీద నాటకం జరుగుతూండగా తీయించుకున్న స్టిల్స్ పంపారు. ఒకరిద్దరు మిగతా నటీనటుల ఫోటోలు కనబడకుండా ఆ మొహాలకి ఇంకు పూసి పంపటం కూడా జరిగింది.

ఓ నాటకంలో నటించి బహుమతిని నటి జమున నుంచి తీసుకుంటూన్న ఫోటోని పంపారు ఒకరు. దాన్ని చూసి దర్శకుడు చిరునవ్వుతో జోక్ చేసారు.

"ఇంతకీ ఈ ఫోటో పంపింది జమునా లేక ఈ అబ్బాయా?"

మోహన్‌బాబులా డైలాగ్స్ చెప్పగలనంటూ ఓ ఉత్తరం రాసిన నటుడు మొదటి పేరాలో ఇలా రాసాడు.

"దర్శక నిర్మాతలకు, ఆఫీసు ఉద్యోగస్తులకు మొదట నా ప్రణామాలు."

మరో నటుడు రాసిన ఉత్తరంలో, ఫోటో నా మొఖంలా చాలా బాగారాలేదు. అంటే నా మొఖం చాలా బాగాలేదని కాదు. అలా అని బావుంది అనికాదు. ఫోటోలో సరిగ్గారాలేదు. నా మొహం బాగా లేదనినన్ను మరిచిపోవద్దు కాబట్టి నాకు అవకాశం యివ్వగలరని ప్రార్థించుచూ మీరు యిచ్చిన ఈ అవకాశానికి మదీయ మానసమనిష్కం పూర్వానంద తుందిలమైనది! అని రాసాడు.

ఓ నటుడు ఉత్తరంలో రాసిన ఓ వాక్యం. "నా గురించి మీరు

అన్నీ విషయాలు విచారించుకోవచ్చు. కావాలంటే మీ సందులోని నూతన్ ప్రసాద్ సెక్రటరీని అడగండి."

"నా పేరు రేలంగి. ఇటీవల స్వర్గాని కెళ్ళాను. మీరు వేషం ఇస్తా నంటే వస్తాను. నేను అప్పుడప్పుడు తెలుగు సినిమాల్లో హాస్య పాత్రల్లో నటించాను. స్వర్గంలో ఫోటోగ్రాఫర్లు ఉండరు కాబట్టి ఫోటో జతచేయటం లేదు" అని ఓ ఉత్తరం వచ్చింది. అది రాసింది ఎవరో కాని ఆ కుర్రాడిని ఓసారి చూడాలనుంది.

చాలా మంది దిన పత్రికలోని చిరునామాని చింపి కవరు మీద అతికించడంతో, తెలుగు తెలియని అరవ పోస్ట్‌మేన్‌కి ఇబ్బంది కలిగి నట్లుంది. చిరునామాని ఎవరో ఇంగ్లీషులోకి తర్జుమాచేసి రాసారు, ఆ ఆ కవర్లన్నిటిమీద. బేరర్ లెటర్స్ అన్నీ తిప్పిపంపబడ్డాయి. చాలా మంది స్వయంగా ఆ సినిమా కంపెనీకే వచ్చేసారు ఉత్తరాలు కూడా ఎందుకని.

"నాకు నటన తెలీదు. కానీ ఎలా చెబితే అలా చేయగలను." అంటూ రాసిన వ్యక్తి నుంచి "నేను అన్నిరకాల పాత్రల్లో నటించగలను. ఎన్టీయర్ డైలాగ్స్‌వున్న పుస్తకం ఇస్తే ఓ పది నిమిషాలు అవి చదివి ఆ సంగతి నిరూపిస్తాను" అంటూ ఆత్మవిశ్వాసంతో రాసిన నటుడిదాకా అందరికి వెండి తెరమీద నటులయి పోవాలనే కోరిక. అతృత ఆశ కనిపించాయి, తమ సామర్థ్యం మీద భవిష్యత్తు మీద నమ్మకం ఉన్నాయి.

ఆ అప్లికేషన్స్ మనిషిలోని రకరకాల భావాలకి, గుణాలకి ప్రతీకగా నిలిచాయి.

ఎన్నిక చేయబడ్డ నటీ నటులకి మద్రాస్‌కి రమ్మని ఆహ్వానిస్తూ రాసిన ఉత్తరాలని పోస్ట్ చేసిన ఆ కంపెనీ ప్రొడక్షన్ అసిస్టెంటు చెప్పాడు.

"చివరికి ఎన్నిక చేయబడ్డవాళ్ళు ఏఎన్నార్ లేదా ఎన్టీఆర్ అంత గొప్ప నటులవచ్చు. కాని మద్రాస్ రమ్మని వచ్చిన ఉత్తరాన్ని పోస్టు చేసింది నేనేనని అప్పుడు గుర్తించుకుంటే నా కంతే చాలు."